క్లుప్తంగా

ఆదర్శం 'ప్రభుత్వ టీచర్'



కూతురుతో ఉపాధ్యాయుడు తిరుపతిరెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అనుపాటి తిరుపతిరెడ్డి తన కూతురు సమీక్షను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో సోమవారం చేర్పించాడు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించి ఇతరులకు ఆదర్శంగా నిలిచాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం లక్ష్మయ్య తిరుపతిరెడ్డిని అభినందించారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లిస్తూ ఆర్థికంగా నష్టపోతున్న తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడిలో చదివించాలని తిరుపతిరెడ్డి కోరారు.

సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్నా ఎంఈఓ, ఉపాధ్యాయులు

అక్కన్నపేట(హుస్నాబాద్): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలని ఎంఈఓ గుగులోతు రంగానాయక్ అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు చిన్నారుల చేత అక్షరాలు దిద్దించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, మండల పరిషత్ సూపరింటెండెంట్ శంకరయ్య, పాఠశాల హెచ్ఎం కనకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే చదివించాలి

దుబ్బాక: ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలని జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి మురళి అన్నారు. సోమవారం దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అక్షర అభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, రచన తదితరులు ఉన్నారు.

పనులు వేగవంతం చేయాలి

మున్సిపల్ చైర్మన్ మంజుల



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ మంజుల

సిద్దిపేటజోన్: పట్టణ ప్రజలకు తాగునీరు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని, పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ మంజుల సూచించారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా మైత్రివనంలో సుమారు రూ.87.5 కోట్లతో మంచి నీటి సరఫరా పైప్ లైన్ పనులను ఆమె మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, వైస్ చైర్మన్ కనకరాజుతో కలిసి ప్రారంభించారు. పనులు జరిగేటప్పుడు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు మహేష్, పద్మ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అక్కారం లోని రైతువేదికలో సోమవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ అనుసంధాన ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి అన్నదాతల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారని పేర్కొన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, డైరెక్టర్ యాదగిరి, నాయకులు అజ్గర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేటకు గ్రంథాలయం కలేనా?

తొమ్మిదేళ్లుగా ఎదురుచూపులు

- బోర్డుపైనే 'పౌర పఠన మందిరం'
- బీరువాకే పరిమితమైన పుస్తకాలు
- లైబ్రరీ అందుబాటులో లేక పట్టణవాసుల ఇబ్బందులు



అక్కన్నపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో పౌర పఠన మందిరం

అక్కన్నపేట(హుస్నాబాద్): సిద్దిపేట జిల్లాలో 26 మండలాలు ఉన్నాయి. అందులో 2016లో అక్కన్నపేట మండలం ఏర్పాటైంది. దాదాపు 9ఏళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు గ్రంథాలయం సేవలు అందుబాటులో లేదు. ఏదైనా పోటీ పరీక్షల నోటిఫికేషన్ విడుదల అయితే నిరుద్యోగులు లైబ్రరీ కోసం పట్టణాలకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో మండలంలోని 37గ్రామాలు ఉండగా దాదాపు 65కుపైగా తండాలతో పాటు మారుమూల పల్లెలు అనేకంగా ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలోనే అధిక గ్రామాలు ఉన్న మండలం కూడా ఇదే.

కూర్చొనేందుకు కుర్చీలు సైతం లేవు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా అక్కన్నపేట మండల కేంద్రంలో 2023లో జూన్ 30న 'పౌర పఠన మందిరం' ఆర్భాటంగా ప్రారంభించారు. మొదట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒక గదిలో ఏర్పాటు చేసి, కొద్దిరోజులకు గ్రామపంచాయతీ కార్యాలయంలో పౌర పఠన మందిరాన్ని తరలించారు. ప్రస్తుతం ఈ పౌర పఠన మందిరం 'పైన పటారం...లోన లొటారం' అన్న చందంగా మారింది. గ్రామపంచాయతీ కార్యాలయం ముందు పౌర పఠన మందిరం అనే పేరుతో బోర్డును తగిలించారు. కార్యాలయం లోపల కూర్చోడానికి కుర్చీలు కూడా లేవు. దాతలు ద్వారా వచ్చిన పుస్తకాలు సైతం బీరువాలో ఉంచి తాళం వేసి పక్కన ఉంచడంపై యువత అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా తగ్గిపోవడంతో పౌర



కుర్చీలు లేక బీరువాలోనే ఉండిపోయిన పుస్తకాలు

పఠన మందిరాలు తలుపు తెర్చుకోక తాళ్లాలకే పరిమితమవుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) భవన ప్రారంభోత్సంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మండల కేంద్రంలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని పలువురు నాయకులు విన్నవించినట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించి యువతకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు, యువత కోరుతున్నారు.

తెర్చుకునేలా చూడాలి

స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉన్న పౌర పఠన మందిరం తెర్చుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానిక యువకులు కోరుతున్నారు. మండల గ్రంథాలయం మంజూరు అయ్యేంతా వరకు నిరుద్యోగులు, యువకులకు అందుబాటులో ఉండేలా ఉదయం, సాయంత్రం 'పౌర పఠన మందిరం' తలుపు తెరించేలా అధికారులు కృషి చేయాలని అంటున్నారు.

గ్రంథాలయం ఏర్పాటు చేస్తాం..



అక్కన్నపేటలో త్వరలో నూతన గ్రంథాలయం ఏర్పాటు చేస్తాం. దాదాపు రూ.1కోటితో భవన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నాం. జిల్లాలో 26మండలాల్లో ప్రస్తుతం 17మండలాల్లోనే గ్రంథాలయాలు ఉన్నాయి. మిగిలిన 9మండలాల్లో కూడా ఏర్పాటు చేస్తాం. ఆ దిశగా ప్రణాళికలను తయారు చేయిస్తున్నాం. మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో మొదట అక్కన్నపేటలోనే గ్రంథాలయం మంజూరు చేసి ప్రారంభిస్తాం.

– కేడం లింగమూర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

పోస్టాఫీసులు ఆర్థికాభివృద్ధికి పునాదులు

ఎంపీ రఘునందన్‌రావు



ఉప తపాలా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉన్న పోస్టాఫీసులు ఆర్థికాభివృద్ధికి పునాదులు వేస్తాయని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. సోమవారం మిరుదొడ్డిలో ఉప తపాలా కార్యాలయాన్ని సూపరింటెండెంట్ డి. శ్రీహరితో కలిసి ప్రారంభించారు. సుకన్య సమృద్ధి యోజన, ఆర్డీ, ఎస్బీ ఖాతాదారులకు పాస్ బుక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అన్ని పోస్టాఫీసుల ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పోస్టాఫీస్‌ల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తెల్లాపూర్, తూప్రాన్‌తో పాటు ప్రస్తుతం మిరుదొడ్డిలో సబ్ పోస్టాఫీసులను ప్రారంభించినట్లు చెప్పారు. మిరుదొడ్డి సబ్ పోస్టాఫీసు నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించి భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, టెలికం బోర్డు మెంబర్ మొగుళ్ల మల్లేశం, మెదక్ ఐపీఓ రాహుల్, సిద్దిపేట ఏఎస్‌పీ శ్రీవత్సవ్, సబ్ పోస్ట్ మాస్టర్లు హరీష్, హర్ష, సంతోష్, మేయిల్ సర్సన్‌లు శేఖర్, పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుపడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 13మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి రూ.20,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నిరుపేదలకు బీఆర్ఎస్ అండ

మిరుదొడ్డి(దుబ్బాక): నిరుపేదలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి అన్నారు. మిరుదొడ్డిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద యువకుడు ఎర్రోళ్ల కృష్ణయ్య కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుమార్, ఎల్లయ్య, రాజయ్య, బాబు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసలు కావద్దు



డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న అదనపు సీఐ

గజ్వేల్‌రూరల్: యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దని గజ్వేల్ అదనపు సీఐ ముత్యంరాజు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని బస్టాండ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ముట్రాజ్‌పల్లి రోడ్డు మార్గంలోని పాన్ డబ్బాలు, టీ పాయింట్స్‌తో పాటు శివారు ప్రాంతాల్లో, అనుమానాస్పద ప్రాంతాల్లో నార్కోటి డాగ్స్‌తో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి రహిత జిల్లాకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ ఎవరైనా కలిగిఉన్నా, అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని, వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. తనిఖీల్లో డాగ్ స్క్వాడ్ స్పెషల్ పార్టీ సిబ్బంది, గజ్వేల్ పోలీసులు పాల్గొన్నారు.

అండర్-19లో ఆరెంజ్ జట్టు విజయం



మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న వెంకట్ నర్సయ్య

సిద్దిపేటజోన్: స్థానిక క్రికెట్ స్టేడియంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–19 వన్డే మ్యాచ్‌లో సిద్దిపేట ఆరెంజ్ రెండు పరుగుల తేడాతో విజయం సాధించింది. సోమవారం సిద్దిపేట ఆరెంజ్, సిద్దిపేట పింక్ జట్ల మధ్య మ్యాచ్‌ను జిల్లా క్రీడాశాఖాధికారి వెంకట్ నర్సయ్య టాస్ వేసి ప్రారంభించారు. మొదట బ్యాటింగ్ చేసిన ఆరెంజ్ జట్టు 45ఓవర్లలో 185 పరుగులు చేసి అలౌట్ అయింది. తర్వాత బ్యాటింగ్ చేసిన పింక్ జట్టు 183పరుగులకే అలౌట్ కావడంతో 2 పరుగుల తేడాతో ఆరెంజ్ గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో పింక్ జట్టు కెప్టెన్ ఇషాంత్ సెంచరీ సాధించగా, ప్రత్యర్థి జట్టు ఆరెంజ్ టీం బౌలర్ అక్షయ్ 8 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు.

దూల్మిట్ట కేజీబీవీని తరలించాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి కేజీబీవీ భవనంలో కొంతకాలంగా కొనసాగుతున్న దూల్మిట్ట కేజీబీవీని వెంటనే దూల్మిట్ట మండలానికి తరలించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి లెనిన్‌రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులతో కలసి మండల కేంద్రంలోని కేజీబీవీ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని కేజీబీవీ పాఠశాలను ప్రభుత్వం ఇటీవల ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేశారని దీంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. గత సంవత్సరం నుంచి దూల్మిట్ట మండలానికి సంబంధించిన పాఠశాలను కొమురవెల్లి పాఠశాలలోనే కొనసాగిస్తున్నారని.. దీంతో విద్యార్థుల సంఖ్య పెరిగి వారికి కనీస సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత అధికారులు స్పందించి దూల్మిట్ట కేజీబీవీని వెంటనే దూల్మిట్ట మండలానికి తరలించాలని కోరారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ క్రీడల్లో రాణించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత ఫుట్‌బాల్ కోచింగ్ శిక్షణను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ..క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసాన్ని అందిస్తాయన్నారు.

◆ నిజాయితీ చాటిన ఆర్టీసీ సిబ్బంది

హుస్నాబాద్: ఆర్టీసీ బస్సులో మరిచిపోయిన విలువైన వస్తువులను తిరిగి ప్రయాణికుడికి సోమవారం అప్పగించారు. హుస్నాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హుజురాబాద్ నుంచి హుస్నాబాద్‌కు వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో సైదాపూర్‌లో కుమ్మరి విజయ్ అనే ప్రయాణికుడు బ్యాగ్‌తో సహా బస్సు ఎక్కాడు. సుందరగిరిలో ఫోన్ మాట్లాడుతూ బస్సు దిగే సమయంలో బ్యాగ్‌ను మరిచిపోయాడు. ప్రయాణికుడు విజయ్ కంట్రోలర్ నంబర్ తెలుసుకొని సమాచారం అందించాడు. కంట్రోలర్ సంబంధిత బస్సు కండక్టర్‌ను అప్రమత్తం చేయడంతో బ్యాగ్‌ను రికవరీ చేశారు. బ్యాగ్‌లో మూడు తులాల బంగారం, ఫోన్, బట్టలు సురక్షితంగా ఉన్నాయి. రికవరీ చేసిన బ్యాగ్‌ను డిపో మేనేజర్ వెంకన్న ప్రయాణికుడికి అందజేశారు.

◆ ఇసుక అనుమతి పత్రాలు అందజేత

అక్కన్నపేట(హుస్నాబాద్): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచిత ఇసుక అనుమతి పత్రాలను ఎంపీడీఓ బానోతు జయరాం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 37గ్రామాల్లో 357 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులున్నారన్నారు. వారి ఇళ్ల నిర్మాణానికి ఉచిత ఇసుకను తరలించేందుకు అనుమతి పత్రాలను ఇస్తున్నామన్నారు. ఒక్కొక్క లబ్ధిదారుల కు 08 ట్రాక్టర్ల ఇసుకను తెచ్చుంకునేందుకు అనుమతి ఇస్తున్నారు. పంచాయతీ కార్యదర్శుల ద్వారా లబ్ధిదారులు తీసుకోవాలని సూచించారు.

◆ రైతు భరోసాకు దరఖాస్తులు

కోహెడ(హుస్నాబాద్): రైతు భరోసా పథకానికి అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు ఏఓ సతీశ్ తెలిపారు. ఈ నెల 5 వరకు మండల వ్యాప్తంగా నూతనంగా పట్టాదారు పాసుపుస్తకం పొందిన రైతులు 264మంది ఉన్నట్లు చెప్పారు. 20 లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

◆ చట్టాలపై అవగాహన

తొగుట(దుబ్బాక): అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎస్కే లతీఫ్ సూచించారు. మండలంలోని వెంకట్రావు పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మహిళా రక్షణ చట్టాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, బ్యాడ్‌టచ్, గుడ్‌టచ్, ఈవిటీజింగ్, గంజాయి మత్తు పదార్థాలు, డ్రగ్స్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వస్తే ఎలాంటి వివరాలు చెప్పొద్దని కోరారు.

ప్రజా సంక్షేమానికి అహర్నిశలు కృషి

బీజేపీ రాష్ట్ర గీతా సెల్ కోకన్వీనర్ కిరణ్‌కుమార్‌గౌడ్



అవగాహన కల్పిస్తున్న కిరణ్‌కుమార్‌గౌడ్

కొండపాక(గజ్వేల్): ప్రజా సంక్షేమం కోసం ప్రధాని మోదీ అహర్నిశలు కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర గీతా సెల్ కోకన్వీనర్ కిరణ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధి మేదినీపూర్ గ్రామంలో వికసిత్ భారత్ 11 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు అనుముల సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పనితీరులపై రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధిహామీ పథకం, రేషన్ బియ్యం పంపిణీ, వ్యవసాయ పరికరాల పనిముట్లపై సబ్సిడీలు, ఎరువులపై సబ్సిడీలను కేంద్ర ప్రభుత్వం భరిస్తుందన్న విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒకేసారి 3 నెలల సన్నరకం రేషన్ బియ్యాన్ని అందజేస్తుందన్నారు. ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూసేలా కేంద్రం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సంపత్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత



వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న మల్లికార్జున్

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెత్త రహిత పట్టణంగా తయారు చేసుకోవడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ పిలుపునిచ్చారు. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేశారు. నీటిని నింపి క్లోరినేషన్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు అవగాహన కోసం పలు చోట్ల వాల్ పెయింటింగ్ వేయించినట్లు తెలిపారు. తడి, పొడి, హానికర చెత్తను విభజించి మున్సిపల్ వాహనానికి అందించాలని కోరారు. టీ తాగేటప్పుడు పేపరు కప్పులకు బదులు స్టీల్ కప్పులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సంపత్ రావు, సానిటరి ఇన్‌స్పెక్టర్ బాలఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు మోదీ కృషి



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు చంద్రం

తొగుట(దుబ్బాక): దేశంలో పేదరిక నిర్మూలనకు ప్రధాని నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో దేశాన్ని 4వ అగ్రరాజ్యంగా నిలిపిన ఘనత నరేంద్ర మోదీకి దక్కిందన్నారు. మండలంలో 789 మంది రైతుల నుంచి 8387 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు ధాన్యం కొనుగోలు రాష్ట్ర ప్రభుత్వం చేసిందన్నారు. రూ 3.28 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉందన్నారు. వర్షాకాలం పంట సాగుచేస్తున్న క్రమంలో ప్రభుత్వం రైతులకు డబ్బులు ఖాతాల్లో జమచేయకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతుల డబ్బులు ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిక్కుడు లింగం, స్వామిరెడ్డి, రాజు, కర్నాకర్, గణేష్, మహేష్, ఏసురత్నం, నిర్సంలు, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు అందరికీ ఆదర్శం



కుమారుడిని పాఠశాలలో చేర్పించిన ఉపాధ్యాయుడు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధ్యాయుడు తను పనిచేసే ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించి అందరికి ఆదర్శంగా నిలుస్తుండు జగదేవ్‌పూర్ మండలంలోని వట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు రవిరాజ్ ఉత్తమ్. గతేడాది అక్టోబర్‌లో పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడి చేరారు. కాగా ఈ ఏడాది తమ కుమారుడు శర్వాన్షు రాజును 8వ తరగతిలో వట్టిపల్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. అలాగే తమ కూతురు శ్రేయాని ్వని 9వ తరగతిలో జగదేవ్‌పూర్ బాలికల పాఠశాలలో చేర్పించి అందరిచే శభాష్ అనిపించుకుంటున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరోజ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు రవిరాజ్ ఉత్తమ్‌ను ప్రతి ఉపాధ్యాయుడు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామ యువకులు ఉపాధ్యాయుడిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరశురామ్, బాలరాజు, విజయ, భాస్కర్‌రెడ్డి, మల్లయ్య, స్వామి, నర్సింహ్మారెడ్డి, సుకృత్, అమ్మ ఆదర్శ చైర్మన్ భవాని తదితరులు పాల్గొన్నారు.

నూతన స్కూల్ భవనం నిర్మించాలి



విద్యార్థులతో జిల్లా నాయకులు

యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూం కాలనీలోని నూతన పాఠశాల భవనం నిర్మించాలని, యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గుడికందుల రవి అన్నారు. సోమవారం యూఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్‌రూం కాలనీల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇరుకుగదుల్లో, మరుగుదొడ్ల పక్కనే విద్యార్థులు కూర్చొని పాఠాలు వినడం జరుగుందన్నారు. అందువలన ప్రభుత్వం వెంటనే నూతన పాఠశాల భవనం నిర్మించాలన్నారు.

సదస్సులతో భూసమస్యలు పరిష్కారం



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మూర్తి

మద్దూరు(హుస్నాబాద్): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్లు హుస్నాబాద్ ఆర్డీఓ రామ్మూర్తి అన్నారు. మండలంలోని వంగపల్లి, జాలపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసి రెవెన్యూ సదస్సులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఏళ్లుగా భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో సాదాబైనామా, మిస్సింగ్ సర్వే నంబర్లపై దరఖాస్తులు చేసుకుంటున్నారన్నారు. వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ చేసి అనంతరం రైతులకు న్యాయం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్వో మహ్మద్ అబ్దుల్ గఫూర్ రహీం, మధుసూదన్, ఆర్ఐలు రమేష్, అన్వర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

భూములపై పక్కాగా హక్కులుండాలి

కొండపాక(గజ్వేల్): భూములపై పక్కాగా హక్కులుండేలా ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలు చేసిందని తహసీల్దార్ ఎర్రోళ్ల శ్యాం పేర్కొన్నారు. మండలంలోని బందారం గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ..గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణీ పోర్టల్‌లో పరిష్కారం కాని సమస్యలు భూ భారతిలో పరిష్కారం అవుతాయన్నారు. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుంటూ భూ సమస్యల గొడవలను దూరం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలకిషన్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సురేశ్, రెవెన్యూ సిబ్బంది, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.